క్లుప్తంగా

తోటాడలో సమస్యల పరిష్కారానికి కృషి



తోటాడలో కల్వర్టు పనులను పరిశీలిస్తున్న దృశ్యం

మునగపాక : తోటాడను ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతామని ఇందుకు ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా సహకరించాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు కోరారు. తోటాడ పంచాయతీ డెయిరీ దరి నిర్మిస్తున్న కల్వర్టు పనులను బుదవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటాడ పంచాయతీలో సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు. కూటమి నాయకులు దొడ్డి రమేష్, ఆడారి ప్రసాద్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు



కాంగ్రెస్ కార్యాలయంలో రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

పాయకరావుపేట : ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ 55 వ పుట్టినరోజు వేడుకలు పీసీసీ జనరల్ సెక్రటరీ జగతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి, స్వీట్స్ పంపిణీ చేశారు. జగతా శ్రీనివాస్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. పాదయాత్ర ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ పోలవరం అప్పలరాజు, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ చిట్టూరి సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొరుప్రోలు హైస్కూల్లో ఇంటర్ తరగతులు



ఇంటర్ తరగతుల బోధన జరగనున్న కొరుప్రోలు ఉన్నత పాఠశాల

ఎస్.రాయవరం : కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో ఇకపై జూనియర్ కళాశాల తరగతుల బోధన నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సకురు సత్యనారాయణ తెలిపారు. మండలంలో ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల నిర్వహణకు కొరుప్రోలు పాఠశాల ఎంపికైందన్నారు. ఈ మేరకు గురువారం నుంచి తరగతులు నిర్వహణ జరుగుతోందన్నారు. తొలి ఏడాది ఎంపీసీ, బైపీసీలు మాత్రమే బోధన జరుగుతుందన్నారు.

రాయితీపై వరి విత్తనాల పంపిణీ



వరి విత్తనాలు అందజేస్తున్న పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ముసిలినాయుడు

మునగపాక : ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మునగపాక పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దాడి ముసిలినాయుడు కోరారు. మునగపాక పీఏసీఎస్ ఆవరణలో రైతులకు రాయితీపై వరి విత్తనాలను ఆయన బుధవారం అందజేశారు. సీజన్‌లో రైతులకు అవసరమయ్యే విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలతో మహిళ అరెస్ట్

సబ్బవరం: పరవాడ మండలంలో పెదముషిడివాడ గ్రామంలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన దాడి గంగా భవానిని 8 మద్యం సీసాలతో అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ పి దుర్గా ప్రసాద్ తెలియజేశారు. తనిఖీలు నిర్వహించిన వారిలో ఎస్ఐ రాజశేఖర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణతో వ్యాధుల నిర్మూలన

ఎస్.రాయవరం: విద్యార్థులంతా దోమల వల్ల వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కలిగిఉండాలని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది చెప్పారు. తిమ్మాపురం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బుధవారం కీటక నాశిని మందులు స్ప్రేయింగ్ చేయించారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

రక్తహీనత నివారించాలి

బాలికలు రక్తహీనతపై అవగాహన కలిగించుకోవాలని సర్వసిద్ధి ,పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారులు శక్తిప్రియ వై.నాయుడు అన్నారు. లింగరాజుపాలెం గ్రామంలో ప్రపంచ సికెల్ సెల్ అవేర్నెస్ డే నిర్వహించారు. ఎనీమియా వ్యాధులు పూర్తిగా నిర్మూలన దిశగా ప్రతి ఒక్కరూ సహకరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు.



లింగరాజుపాలెంలో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యురాలు శక్తి ప్రియ



కస్తూర్బా పాఠశాలలో కీటక నాశిని మందులు స్ప్రేయింగ్ చేస్తున్న దృశ్యం

ఎమ్మెల్సీకి ఏపీటీఎఫ్ నాయకుల వినతి

ఎస్.రాయవరం : విద్యా విధానంలో మార్పులు తెచ్చి పాత పద్ధతిలో స్టేట్ సిలబస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎమ్మెల్సీ రఘువర్మకు వినతి పత్రం అందజేశారు. ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షుడు కర్రి ధర్మారావు మాట్లాడుతూ జీవో నెంబర్ 117 రద్దు చేయాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ ప్రకారం జీతాలు ఇవ్వాలని, తల్లికి వందనం కేవలం ప్రభుత్వ పాఠశాలలకే వర్తింపజేయాలని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయ సమస్యలను తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు.



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి



వలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ నేత బ్రహ్మాజీ

మునగపాక : వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.బ్రహ్మాజీ కోరారు. ఎన్నికల ముందు వలంటీర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ బుధవారం ఉమ్మలాడకు చెందిన వలంటీర్లు ఎంపీడీవో మన్మథరావుకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలందించే వలంటీర్లకు సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సమాజ్‌వాదీ పార్టీ నాయకులు లంబా శ్రీనివాసరావు,పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

త్వరలో నియోజకవర్గ సమస్యలపై సమీక్ష

- హోంమంత్రి అనిత
- నియోజకవర్గ నాయకులతో సమావేశం

నక్కపల్లి : త్వరలో నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై సమీక్ష నిర్వహించనున్నట్టు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. బుధవారం విజయవాడలో తన క్యాంపు కార్యాలయంలో పాయకరావుపేట నియోజకవర్గ టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు, నాయకులతో సమన్వయం ఏర్పాటు చేసుకుని హామీలు నెరవేర్చడానికి ముందుకు సాగాలన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత నియోజకవర్గానికి వస్తానని, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, అధికారులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. కోటవురట్ల మండలం జల్లూరు వంతెనను పూర్తి చేయాలని, పాడైన రహదారులకు మరమ్మతులు చేయిస్తామన్నారు. నక్కపల్లి మండలం ఉద్దండపురం వాటర్ గ్రిడ్‌ను పూర్తిచేసేందుకు నిధులు మంజూరు చేయిస్తామన్నారు. పాయకరావుపేట, ఎస్.రాయవరం మండలాల్లో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలు, ఎన్నికల ముందు ఇచ్చి వాగ్దానాలపై దృష్టిసారించాలని, ప్రధాన సమస్యలను ఆయా మండలాల నాయకులు గుర్తించి తనకు నివేదిక సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు చేపడతానన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పి.చిట్టిబాబు, జానకి శ్రీను, ఎ.అబద్ధం, మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ మాజీ జెడ్పీటీసీలు నూకరాజు, కొండబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీనాయుడు తదితరులు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సమావేశమైన హోం మంత్రి అనిత

అచ్యుతాపురంలో సుందరీకరణ పనులు

అచ్యుతాపురం : అచ్యుతాపురం జంక్షన్‌లో సుందరీకరణ పనులు బుధవారం ప్రారంభించారు. తహసీల్దార్ సరోజిని, ఎంపీడీవో సురేష్‌కుమార్ పర్యవేక్షణలో అచ్యుతాపురం జంక్షన్ పరిసరాలను పరిశీలించారు. రోడ్డు పక్కన ఆక్రమణలు తొలగింపు, డ్రైనేజీల మరమ్మతులు, రోడ్డు పక్కన మొక్కలు నాటడం వంటి పనులను నిర్వహించాలని నిర్ణయించారు. ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ ఇటీవల అచ్యుతాపరం జంక్షన్‌ను పరిశీలించి ఆదేశాలను జారీ చేసిన నేపథ్యంలో అధికారులు కమిటీగా ఏర్పడి సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు సమాచారం.

హోంమంత్రి అనితకు నాయకుల అభినందనలు

నక్కపల్లి: రాష్ట్ర హోమ్‌శాఖామంత్రిగా బుధవారం బాధ్యతలు చేపట్టిన వంగల పూడి అనితకు నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ సీనియర్ నాయకులు అభినందనలు తెలిపారు. సచివాలయంలో అనిత హోమ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్.రాయవరం, కోటవురట్ల మండల టీడీపీ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, పెదిరెడ్డి చిట్టిబాబు, అమలకంటి అబద్ధం, జానకి శ్రీను , జిల్లా గ్రంథలయ సంస్థ మాజీ చైర్మన్ తోటనగేష్, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ మాజీ చైర్మన్ కొయ్యప్రసాద్‌రెడ్డి తదితరులు ఆధ్వర్యంలో నాయకులు ,కార్యకర్తలు అమరావతి తరలివెళ్లారు. నాయకులంతా అనితను గజమాలలు, పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువలతో సత్కరించి అభినందనలు తెలిపారు. నక్కపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ నియోజకవర్గం ఏర్పడి దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత మంత్రిపదవి రావడం ఆనందంగా ఉందన్నారు. అనిత ఆధ్వర్యంలో శాంతిభద్రతల సమస్యలు పరిష్కరించడంతోపాటు, నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నూకరాజు, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ పెంకుల రాజు, బాబ్జిరాజు, వైబోయిన రమణ, కొప్పిశెట్టి బుజ్జి, సత్తిబాబు, చిక్కాలశ్రీను, సుధా రాజు, రవిరాజు తదితరులు ఉన్నారు.



హోం మంత్రి అనితను అభినందిస్తున్న వెంకటేష్ తదితరులు

గీత కార్మికులకు బీమా వర్తింపజేయాలి



కల్లుగీత కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి త్రినాథ్

తుమ్మపాల: కల్లుగీత కార్మికుడు సహజంగా మరణిస్తే రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షలు, గాయపడినా, అంగవైకల్యం ఏర్పడినా రూ.2 లక్షలు బీమా సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కండేపల్లి త్రినాథ్ అన్నారు. కొత్తగా గీత వృత్తి చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం లైసెన్సులు మంజూరు చేయాలన్నారు. కంపెనీలు, ప్రాజెక్టులు నిర్మాణంలో పరిసర ప్రాంతాల్లోని తాటి చెట్లను తొలగించడం వల్ల గీత కార్మికులు ఉపాధికి కోల్పోయి, నష్టానికి గురవుతున్నారని పేర్కొన్నారు. తాటి చెట్లు లేకపోతే గీత కార్మికుల బతుకులు ప్రశ్నార్థకమని, రైతులు తాటిచెట్లను వేసేలా ప్రోత్సహించాలని కోరారు. ప్రతి గీత కార్మికుడికి ఎకరం భూమి అందించాలని, భవన నిర్మాణ కార్మికుల మాదిరిగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

అవగాహనతోనే సికిల్ సెల్ నియంత్రణ



తాళ్లపాలెం పీహెచ్‌సీలో సికిల్ సెల్ అనీమియాపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది



సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన ర్యాలీలో తుమ్మపాల పీహెచ్‌సీ సిబ్బంది

కశింకోట: సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనలో ప్రజలు భాగస్వామ్యులు కావాలని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యు.రమేష్ కోరారు. మండలంలోని తాళ్లపాలెంలో ప్రపంచ సికిల్ సెల్ అనీమియా అవగాహన దినోత్సవం సందర్భంగా బుధవారం ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్ సెల్ అనీమియా నిర్మూలనకు అంతా సమష్టి బాధ్యతగా కృషి చేయాలన్నారు. దీని బారినుంచి బయటపడేందుకు చికిత్స, అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంత ముందుగా దీన్ని గుర్తిస్తే అంత వేగంగా నివారించవచ్చన్నారు. ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, ఆరోగ్య విస్తరణాధికారి వీపీ సుబ్బారావు, ఆరోగ్య పర్యవేక్షకుడు కేఎస్ఆర్‌కేజీ నరసింహారావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తుమ్మపాల: సికిల్ సెల్ వ్యాధి(రక్తహీనత) నిర్మూలనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని వైద్యురాలు డాక్టర్ నుస్రీత్ షమీమ్ తెలిపారు. మండలంలోని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో 2047 నాటికి రక్తహీనత పూర్తిగా నిర్మూలించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అధికంగా గిరిజన ప్రభావిత ప్రాంతాల్లో 0 నుంచి 40 ఏళ్ల వయసున్న వారికి నిర్ధారణ పరీక్షలు చేసి, అవగాహన పెంచే చర్యలు చేపట్టిందన్నారు. రక్తహీనత అనేది ఎర్రరక్త కణాల రుగ్మతల సమూహమని, శరీరంలో ఆక్సిజన్ సరఫరా క్షీణించడం ద్వారా కణజాలం, అవయవ నష్టాలు జరుగుతాయన్నారు. రక్త ప్రసరణలో అడ్డంకులు ఏర్పడి తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయన్నారు. రక్తహీనతతో కళ్లు పసుపు రంగులో మారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, అలసట, అంటువ్యాధులు, గర్భధారణ సమస్యలు తదితర లక్షణాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బి.సంగం, హెచ్‌వీ ఎం.మరియమ్మ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణకు అందరూ తోడ్పడాలి

రాంబిల్లి: ధర్మ పరిరక్షణకు అందరూ తోడ్పడాలని సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి ఎస్.నూకరాజు అన్నారు. పెదకలవలాపల్లి గ్రామంలో బుధవారం ఛత్రపతి శివాజీ పట్టాభిషేకం వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. హిందూ ధర్మ పరిరక్షణ, సంస్కృతికి శివాజీ పనిచేశారని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సమరసత ప్రతినిధులు అప్పారావు, గగన్ తదితరులు పాల్గొన్నారు.



ఛత్రపతి శివాజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సమరసత సభ్యులు

రిటైర్డ్ హెచ్ఎం కుమార్ సేవలు ఆదర్శనీయం

మునగపాక : విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసిన ఉద్యోగులకు సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని మాజీ ఎంపీపీ కొయిలాడ వెంకట్ అన్నారు. తోటాడ హైస్కూల్ హెచ్ఎంగా పనిచేసి పదవీ విరమణ చేసిన బి.కుమార్ దంపతులను బుధవారం హైస్కూల్ ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని, అలాగే హైస్కూల్ అభివృద్ధితో పాటు విద్యాభివృద్ధికి సేవలందించిన కుమార్‌ను ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల చదువులపై దృష్టి సారించాలన్నారు. ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు, సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, పెద్దలు దొడ్డి బాలాజీ, షేక్ ఇస్మాయిల్, కుమార్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పదవీ విరమణ చేసిన తోటాడ హైస్కూల్ హెచ్ఎం కుమార్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

కృష్ణంరాజు కాలువపై దెబ్బతిన్న రెయిలింగ్

మునగపాక : మేజర్ పంచాయతీ మునగపాకలో కృష్ణంరాజు కాలువపై రెయిలింగ్ దెబ్బతినడంతో రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కృష్ణంరాజు కాలువపై బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జి ద్వారా పలువురు రాకపోకలు సాగిస్తుంటారు. గ్రామంలోకి వెళ్లేందుకు వీలుగా నిర్మించిన బ్రిడ్జికి సంబంధించిన రెయిలింగ్ దెబ్బతినడంతో వాహన చోదకులు ఆందోళనకు గురవుతున్నారు. నిత్యం వందలాది మంది ఈ బ్రిడ్జిపై నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుత రెయిలింగ్ పరిస్థితుల పట్ల ఆందోళనకు గురవుతున్నారు. రాత్రి సమయంలో ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని కలవరపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదం జరగకుండా రెయిలింగ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.



మునగపాకలో కృష్ణంరాజు కాలువపై దెబ్బతిన్న రెయిలింగ్

పెండింగ్ వేతనాలు చెల్లించండి

మునగపాక : పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ ఉపాధిహామీ పథకం కూలీలు బుధవారం ఎంపీడీవో ఎం.మన్మథరావుకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి బ్రహ్మాజీ మాట్లాడుతూ గత అయిదు వారాలుగా వేతనాలు రాక ఉపాధి హామీ పథకం కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే పనిచేసే ప్రాంతాల్లో వసతులు లేవన్నారు. పనిదినాలను 200కు పెంచడంతో పాటు రూ.600 వేతనం రోజుకు అందించేలా చూడాలన్నారు. రైతు సంఘ అధ్యక్షుడు ఆడారి మహేష్, కూలీలు పెంటకోట వెంకట పూర్ణ సత్యనారాయణ, వేగి ఆది సూరప్పారావు, ఆడారి నూకప్పారావు, దాడి సత్తిబాబు, పి.సూర్యనారాయణ తదితరులు వినతి అందజేసిన వారిలో ఉన్నారు.



ఎంపీడీవో మన్మథరావుకు వినతి అందజేస్తున్న ఉపాధి కూలీలు

విద్యార్థులకు యోగా తరగతులు

నక్కపల్లి : యోగా మంచి ఔషధం వంటిదని, యోగాతో ఆరోగ్యం, జ్ఞానం పొందవచ్చని యోగా ట్రైనర్ డి. రాంబాబు అన్నారు. బుధవారం చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యోగాలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పది రోజుల పాటు ఇక్కడ విద్యార్థులకు యోగాలో వివిధ ఆసనాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మానసిక వికాసంతో పాటు, మంచి జ్ఞానాన్ని, జ్ఞాపకశక్తిని, సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే యోగాను నేర్చుకోవాలని విద్యార్థులకు వివరించారు. వివిధ ఆసనాలను నేర్పించారు. ప్రతి పాఠశాలలలోను ప్రతిరోజు గంట పాటు యోగా తరగుతులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులే కాకుండా వారి తల్లిదండ్రులు కూడా యోగా నేర్చుకోవచ్చన్నారు. ఈయోగా తరగతులను చినదొడ్డిగల్లు పాఠశాలలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లిష్ క్లబ్ వ్యవస్థాపకులు ఏడిద వెంకటరమణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీడీ ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చినదొడ్డిగల్లు పాఠశాల విద్యార్థులకు యోగాలో శిక్షణ ఇస్తున్న ట్రైనర్ రాంబాబు

మినీ వంతెనతో ఇక్కట్లు

కోటవురట్ల : రామచంద్రపురం జంక్షన్‌లోని మినీ వంతెన మరమ్మతుకు గురికావడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడంలేదు. వంతెన శిథిలమై బీటలువారింది. ఓ పక్క కొంచెం వాలిపోయింది. దాంతో భారీ వాహనాలను నిరోధిస్తూ ఆర్అండ్‌బీ శాఖాధికారులు తాత్కాలికంగా వంతెనకు ఇరువైపులా గోడలు నిర్మించారు. ఈ వంతెన మీదుగానే నర్సీపట్నం వెళ్లేందుకు నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ప్రస్తుతం వంతెనకు సగం వరకు గోడలు నిర్మించడంతో భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ వంతెన కూలిపోకముందే కొత్త వంతెనను నిర్మించాలని పలువురు కోరుతున్నారు.



రామచంద్రపురం జంక్షన్‌లోని మినీ వంతెన

రాయితీపై విత్తనాల పంపిణీ

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో బుధవారం రైతులకు రాయితీపై వరి విత్తనాలను ఏవో సి. సుమంత అందజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆర్‌జీఎల్-2537, బీపీటీ 5204, ఎంటీయూ 1224, ఎంటీయూ 1318 రకాల వరి విత్తనాలను రైతులకు అందజేస్తున్నామన్నారు. రాయితీపై అందించే ఈ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రంగనాయకులు, దిన్‌బాబు, జనసేన మండల అధ్యక్షుడు నూకన్నదొర పాల్గొన్నారు.



రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న ఏవో సుమంత తదితరులు

వైభవంగా కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

తుమ్మపాల: పట్టణంలోని గవరపాలెం సతకంపట్టు కనకదుర్గ అమ్మవారి ఆలయ సప్తమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బోగాపురపు వెంకటరమణ(బాబు) ఆధ్వర్యంలో దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. ప్రముఖ బిల్డర్, సంఘ సేవకుడు కాండ్రేగుల నాయుడు, భాగ్యలక్ష్మి దంపతులు, మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమలు, చీరలు సమర్పించారు. అనంతరం స్వామి వారి విగ్రహానికి మంగళ స్నానాలు చేయించి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామి వారి కల్యాణంలో భీశెట్టి సంతోష్, కోమలి, పాలమరశెట్టి వెంకట సూర్యనారాయణ, నవ్య దంపతులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ గౌరీప రమేశ్వరుల కమిటీ సభ్యులు, శ్రీ మరిడిమాంబ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి.



కనకదుర్గమ్మకు పసుపు కుంకుమలు సమర్పిస్తున్న భక్తులు

సాయిబాబా ఆలయంలో కంటి వైద్య శిబిరం

నర్సీపట్నం: శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో శ్రీషిర్డీసాయి సేవా సమాజ్ సాయిబాబా ఆలయంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీనిజ 98 మందికి కంటి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 38 మందిని కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేసి, శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. కంటి విషయంలో సరైన జాగ్రత్తులు తీసుకోవాలని వైద్యులు సూచించా రు. ఉచితంగా ఫౌండేషన్ ద్వారా వైద్య సేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో సేవా సమాజ్ ప్రతినిధులు లంక ఈశ్వరరావు, ఎం.రాజేష్, పి.రామారావు, క్యాంపు మేనేజర్ అరుణ్ కుమార్, కో ఆర్డినేటర్ సతీష్ పాల్గొన్నారు.



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనిజ